క్లుప్తంగా

అన్ని కాలనీలను అభివృద్ధి చేస్తాం



భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: పట్టణంలోని అన్ని కాలనీలను అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. పట్టణంలోని 24వ వార్డులో గురువారం రూ.5లక్షలతో సీసీ రోడ్లకు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలో ప్రజలందరికీ మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సహకారంతో అన్ని కాలనీల్లో డ్రైనేజీ, వీధి దీపాలు, మంచి నీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్లు పార్వతి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి నరసింహయ్యకు నివాళి



తెలకపల్లి నరసింహయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు: ఉద్యమ నిర్మాత తెలకపల్లి నరసింహయ్య అని సీపీఎం జిల్లా నాయకులు రాజశేఖర్, కార్యదర్శి ఏసురత్నం అన్నారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో గురువారం సీనియర్ సీపీఎం నాయకులు తెలకపల్లి నరసింహయ్య వర్ధంతి సభను నిర్వహించారు. వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో సీపీఎం ఏర్పాటుకు నరసింహయ్య ఎనలేని సేవ చేశారన్నారు. ఎన్నో కష్టాలు ఎదుర్కొని పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేశారన్నారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రామ్‌నాయక్, ఇస్మాయిల్, వెంకటేష్, రఫి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: జిల్లాలో రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి తెలకపల్లి నరసింహయ్య అని సీపీఎం సీనియర్ నాయకులు రామేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో తెలకపల్లి నరసింహయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న, నాయకులు వెంకటేశ్వరరావు, ఎస్‌ఆర్ రమణ, బాలయేసు, మధుకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను నెరవేరుస్తున్న సీఎం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సర్పంచు వరప్రసాద్

పాములపాడు: రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెరవేస్తున్నారని సర్పంచు వరప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో సామాజిక న్యాయ మహా శిల్పం ఆవిష్కరణకు మద్దతుగా స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం చేస్తూ, సంక్షేమ ఫలాలను ప్రజల ముంగిటకు చేరుస్తున్న మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కల్యాణ్, వైఎస్ఆర్‌సీపీ నాయకుడు కేశవగౌడు పాల్గొన్నారు.

స్వయం సమృద్ధి గ్రామాలే లక్ష్యం

పగిద్యాల: స్వయం సమృద్ధిగా మౌలిక సదుపాయలు కలిగిన గ్రామాలే లక్ష్యంగా అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసి ఆమోదించుకోవాలని శిక్షకులు, కార్యాలయ సూపరింటెండెంట్ నాగరాజరావు సూచించారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో చేపట్టిన శిక్షణా కార్యక్రమం గురువారం కూడా కొనసాగింది. ఎంపీడీఓ వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఆయా శాఖాధికారులు తయారు చేసే ప్రణాళికల్లో పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు, ఆరోగ్యం, బాలల స్నేహపూర్వక, పరిశుభ్రత, పచ్చదనం, సామాజిక న్యాయం, సామాజిక భద్రత తదితర అంశాలతో ప్రణాళికలను రూపొందించాలన్నారు. వాటిని గ్రామసభలో ఆమోదించిన అనంతరం తీర్మానాలను ఈ గ్రామ స్వరాజ్య పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుభాన్, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

మహానంది: మహానంది దేవస్థానంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి వైఎస్సార్ జిల్లా , కడపకు చెందిన మధుసూదన్‌రెడ్డి గురువారం రూ.5000 విరాళం అందజేశారు. శ్రీకామేశ్వరి దేవి, మహానందీశ్వరస్వామివారి దర్శనం అనంతరం విరాళాల కేంద్రం వద్దకు చేరుకుని ఆలయ ఇన్‌స్పెక్టర్ రంగన్నకు నగదును అందించారు. దాతకు స్వామివారిప్రసాదాలు అందజేశారు.

కేపీఎల్ స్ఫూర్తితో మరిన్ని క్రీడా పోటీలు

- అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- ముగిసిన కార్తీక్ ప్రీమియర్ లీగ్
- నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేత నున్నిపెంట జట్టుకు రూ.లక్ష బహుమతి
- రెండో స్థానంలో ఆత్మకూరు
- ట్రోఫీ అందజేసిన శిల్పా కార్తీక్‌రెడ్డి





విజేత సున్నిపెంట జట్టును అభినందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి,రెండవ బహుమతి పొందిన ఆత్మకూరు జట్టుకు నగదు, ట్రోఫీ అందజేస్తున్న శిల్పాకార్తీక్‌రెడ్డి

ఆత్మకూరు: క్రీడాకారులు గెలుపోటములను సాధారణంగా తీసుకోవాలని, కేపీఎల్ (కార్తీక్ ప్రీమియర్ లీగ్)కి విశేష స్పందన లభించిందని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహిస్తామని అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం కార్తీక్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులను తన యుడు శిల్పా కార్తీక్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరు పట్టణం క్రీడలకు పుట్టినిల్లని, ఇక్కడ క్రీడలను నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. శిల్పా కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్‌పోటీలకు పెద్ద ఎత్తున ఆదరణ లభించిందని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా నియోజకవర్గ పరిధిలో 205 జట్లు పాల్గొని, తొమ్మిది రోజులు పాటు వివిధ ప్రాంతాల్లో మ్యాచ్‌లు జరిగాయన్నారు. తన తనయుడు శిల్పా కార్తీక్‌రెడ్డి తాను సైతం ఊహించని విధంగా క్రికెట్ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

క్రీడాకారులకు నగదు బహుమతి, ట్రోఫీ

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం జరిగిన కార్తీక్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ ఫైనల్ పోటీల్లో సున్నిపెంట జట్టు విజేతగా నిలువగా రూ.లక్ష బహుమతిని, ట్రోఫీని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గం నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి అందజేశారు. రెండవ బహుమతి రూ.50 వేలు ఆత్మకూరు జట్టుకు, మూడో బహుమతి రూ.20 వేలు ఆత్మకూరు జట్టుకు, రూ.10 వేలు నాల్గవ బహుమతి మహానంది, మసీదుపురం జట్ల క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. అనంతరం మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది ప్లేయర్ క్రీడాకారులకు బహుమతులు అందజేయడమే కాకుండా ఫైనల్‌కు చేరుకున్న జట్లకు రూ.5 వేల చొప్పున కన్సోలేషన్ బహుమతి అందజేశారు.

క్రీడాకారులకు అండగా ఉంటాం

శిల్పా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలో భారీ స్థాయిలో పోటీలు నిర్వహించామని, 205 జట్లు పాల్గొనడం హర్షించదగ్గ విషయం అన్నారు. అందరి మన్ననతో తాము క్రీడాకారులకు క్రీడాస్ఫూర్తిని కల్పించడమే కాకుండా అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారు. క్రీడాకారులు మెలుకువలు నేర్చుకుని ఉన్నత స్థాయి క్రీడాకారులుగా రాణించాలన్నారు. అనంతరం పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి క్రీడా సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల నాయకులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, వరాల మాలిక్, పువ్వాడ భాస్కర్, విజయ్, మహానంది, వెలుగోడు మండలాధ్యక్షులు మహేశ్వరరెడ్డి, అంబాల ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెలుగోడు సర్పంచ్ జైపాల్, నాయకులు సుల్తాన్, జావేద్, నాగరాజు, రషీద్, బాషా, కోట్ల నాగేశ్వరరెడ్డి, ఇలియాజ్, సుధాకర్‌రెడ్డి, అన్ని మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆత్మకూరు: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్‌యార్డ్ చైర్మన్ బాలస్వామియాదవ్ తెలిపారు. పట్టణంలోని మార్కెట్‌యార్డ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు మండలాల పరిధిలో కందులు ఈ–క్రాప్ చేసుకున్న రైతుల కోసం ఆర్బీకే పరిధిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి గల రైతులు ఆత్మకూరు జీసీఎంఎస్ బ్యాంక్ మేనేజర్ నవీన్‌కుమార్ సెల్– 9000889639 కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతాకు సంబంధించిన వివరాలతో రావాలని తెలిపారు.

కులగణనపై అవగాహన సదస్సు

ఆత్మకూరు: పట్టణంలోని వలంటీర్లకు స్థానిక ఎంఎం ఫంక్షన్‌హాల్‌లో కులగణనపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న కులగణనపై వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వలంటీర్లు ఇంటింటికీ తిరిగి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓసీ కులాలు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలు తెలుసుకుని వారు ఏ కులానికి చెందారు లాంటి వివరాలు నమోదు ఎలా చేయాలో వివరించారు.

బీసీలకు రాజ్యాధికారం కోసం పోరాడుదాం



మాట్లాడుతున్న జాతీయ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు

ఆత్మకూరు: బీసీలకు చట్ట సభలో రిజర్వేషన్, రాజ్యాధికారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని జాతీయ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాగా వెంగళరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నూకాలమ్మ, జాతీయ కన్వీనర్ నాగేశ్వరరావు యాదవ్, జాతీయ కార్యదర్శి శ్రీనివాసులు, శ్రీశైలం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్ పిలుపునిచ్చారు. గురువారం బీసీ రాజ్యాధికారం కోసం చేపట్టిన రథయాత్రను ఆత్మకూరులో ప్రారంభించారు. వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా...బీసీల తలరాతలు మారలేదని, అసమానతల వలన నేటికీ రాజ్యాధికారానికి దూరంగా ఉన్నామన్నారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించేందుకు బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని, రాష్ట్రంలో 90 ఎమ్మెల్యే, 13 ఎంపీ స్థానాలకు బీసీలకు టిక్కెట్‌లు కేటాయించాలని కోరారు. అనంతరం పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంబాబు, నాయకులు వెంకటేష్, రఘురాముడు యాదవ్, బాలస్వామియాదవ్, తిమ్మయ్య, రమణ, శివ, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.



పాములపాడులో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూల మాల వేస్తున్న బీసీ సంఘం నాయకులు

చట్ట సభలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి

పాములపాడు: చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు అన్నారు. బీసీల రాజ్యాధికారం కోసం చేపట్టిన మరో స్వాతంత్ర్య పోరాట రథ యాత్ర గురువారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతీరావుపూలే విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీల జాతీయ సంఘం కన్వీనర్ నాగేశ్వరమాదవ్, ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, నాయకులు రాంబాబు, గోపాల్, తిరుపాలు, రామ్మోహన్, శంకర్‌గౌడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి

నందికొట్కూరు రూరల్ : మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని బ్రాహ్మణకొట్కూరు పీహెచ్‌సీ సెంటర్ 4 గంటలకే మూసేసి ఇళ్లకు వెళుతుండటంపై వైద్య సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖకు సంబంధించి మండల పీడీఎస్ కమిటీ సమావేశాన్ని అసలు నిర్వహించడం లేదని, ఇప్పటికైనా అధికారులు గుర్తించి ప్రతి నెలా కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డీటీ సోమేశ్వరికి సూచించారు. ఆయా శాఖల అధికారులు వారి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం గ్రామాల సర్పంచులు వారి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శోభారాణి, ఈవోఆర్డీ సంజన్న, వైస్ ఎంపీపీ కట్టా మంజుల, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



నివేదికను చదివి వినిపిస్తున్న ఏఓ షేక్షావలి

మూర్వకొండ ఘాట్ వద్ద పోలీస్ బందోబస్తు



అర్లపాడు ఘాట్ వద్ద వీఆర్వో వెంకటస్వామికి సూచనలిస్తున్న ఎస్‌ఐ జయశేఖర్

పగిద్యాల: మండలంలోని నెహ్రూనగర్ సమీపాన ఉన్న మూర్వకొండ, అర్లపాడు ఘాట్‌ల వద్ద గురువారం పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలు జిల్లా సింగోటం గ్రామంలో జరిగే లక్ష్మీనరసింహస్వామి రథోత్సవ వేడుకల సందర్భంగా కృష్ణానది మీదుగా ఇంజిన్ బోట్లలో ప్రయాణికులను తరలించకుండా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముచ్చుమర్రి ఎస్‌ఐ జయశేఖర్ పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టారు. అర్లపాడు, మూర్వకొండ ఘాట్‌లను స్వయంగా పరిశీలించి రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. ఇంజిన్ బోటు నిర్వాహకులు నదిలో బోటు తిప్పరాదని, పోలీసుల ఆదేశాలను బేఖాతర్ చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నది పరివాహకం వెంట ఇంజిన్ బోట్లు తిప్పడంపై ప్రభుత్వం నిషేధం విధించిన సంగతిని విస్మరించరాదని పేర్కొన్నారు. సింగోటం జాతరకు వెళ్లే భక్తులు రోడ్డు మార్గం గుండా వెళ్లాలని గ్రామాల్లో దండోరా వేయించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు

శ్రీశైలంలో పలువురు ఉద్యోగుల అంతర్గత బదిలీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఏఈఓ స్థాయి పర్యవేక్షకులు, రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను అంతర్గత బదిలీ చేస్తూ గురువారం దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ విభాగ ఏఈఓగా ఉన్న ఫణిధర ప్రసాద్‌ను అన్నప్రసాద విభాగం, ఆడిట్ విభాగానికి బదిలీ చేశారు. ఆలయ ఏఈఓగా ఉన్న మోహన్‌ను వసతి విభాగానికి, వసతి విభాగ ఏఈఓ హరిదాసును స్వామివారి ఆలయ విభాగానికి, అలాగే ఏఈఓ మల్లికార్జున రెడ్డిను రెవెన్యూ విభాగానికి పంపారు. పీఆర్వోకు ప్రస్తుతం ఉన్న విధులతో పాటు శివసేవకుల విధుల పర్యవేక్షణ కేటాయించారు. అలాగే పర్యవేక్షకులు మధుసూదన్ రెడ్డిని శ్రీశైలం టీవీ, పబ్లికేషన్, నిత్యాన్నదాన ప్రసాద విభాగం, దేవికకు లడ్డూ విక్రయ కేంద్రానికి బదిలీ చేశారు. అలాగే వీరితో పాటు పలువురు జూనియర్‌అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, టైపిస్ట్‌లను అంతర్గత బదిలీ చేశారు. దేవస్థాన పరిపాలనా సౌలభ్యం కోసం అంతర్గత బదిలీలు చేసినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ అయిన స్థానాల్లో తక్షణమే విధుల్లో చేరాలని ఈఓ తెలిపారు.

విద్యాప్రమాణాలు పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యాప్రమాణాలు పెంచి విద్యారంగ అభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. డీఈఓ మాట్లాడుతూ ట్యాబ్‌ల ద్వారా, డిజిటల్ బోర్డుల ద్వారా బోధనను బలోపేతం చేయాలన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తోజు వీరబ్రహ్మం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షరీఫ్, అన్నెం శ్రీనివాసరెడ్డి, శేషఫణి, నీలంవెంకటేశ్వర్లు, మస్తాన్, మహబూబ్‌బాషా, చంద్రశేఖర్‌శర్మ, వెంకటరాముడు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

అధికారులు రాకపోతే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి?

కొత్తపల్లి: మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు రాకపోతే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎంపీపీ కుసుమలత అధ్యక్షతన, ఎంపీడీఓ మేరి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరు కాకపోవడంపై ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. ఇలా సమావేశాలకు రాని అధికారులపై ఏమి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. గత సమావేశాలలో చర్చించిన సమస్యలపై ఎంతవరకు పరిష్కారం అయ్యాయో చెప్పాలని ఎర్రమఠం సర్పంచు బాల ఎల్లయ్య, కొత్తపల్లి ఎంపీటీసీ అలీ బాషా నిలదీశారు. సమావేశాలకు రాని అధికారులపై తక్షణమే తీసుకోవాలని ఎంపీపీ కుసుమలత ఎంపీడీఓ మేరీకి సూచించారు. స్పందించిన ఎంపీడీవో హాజరుకాని అధికారుల అధికారులకు మెమోలు జారీ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పలు సమస్యలను ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. లింగాల ఎత్తిపోతల పథకం నుంచి రైతుల పొలాలకు నిరందించేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని ఎంపీపీ, ఎంపీడీవోలకు వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ(రంగ) వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కుసుమలత

ఎస్మా ఉపయోగించడం దారుణం

నందికొట్కూరు: అంగన్‌వాడీ కార్మికులపై ఎస్మాను ఉపయోగించడం దారుణమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్, జిల్లా నాయకులు రఘురామ్మూర్తి అన్నారు. గురువారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్మికులకు న్యాయమైన వేతనాలు పెంచాలన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం జీతాలు పెంచి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకురాలు పుణ్యవతి, కమలమ్మ, సువర్ణ, కాత్యాయని, నాగేశ్వరమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

ఆత్మకూరు: ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ నాయకురాలు మంజుల, సీపీయం నాయకులు ఏసురత్నం డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం గురువారం కూడా కొనసాగించారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం పట్టణంలోని కొత్తబస్టాండ్, గౌడ్‌సెంటర్, పాతబస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సురేంద్ర, రమణమ్మ, నాగమ్మ, ప్రమీల, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

జీవో 106/2 రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): లారీ, క్లీనర్లు, డ్రైవర్లపై తెచ్చిన జీఓ నంబర్ 106/2 ను రద్దు చేయాలని ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, అన్వర్‌బాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నంద్యాలలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే జీఓను రద్దు చేయాలని కోరారు. ఇప్పటికే డ్రైవర్లు, క్లీనర్లు దుర్భరమైన జీవితం గడుపుతున్నారని, ఈ చట్టంతో వారి జీవితం మరింత దిగజారే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మోసపూరితమైన నల్ల చట్టాలను వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కుళాయిస్వామి, రాజేష్, షరీఫ్, మున్నా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యారంగ ప్రగతికి కృషి చేయాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల శ్రేయస్సే ఉపాధ్యాయ లక్ష్యమని, విద్యారంగ ప్రగతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఏపీ ఎన్‌జీఓ హోంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం సంస్థ నంద్యాల జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా కన్నయ్య, ఉపాధ్యక్షుడిగా రబ్బానీ, ప్రధాన కార్యదర్శిగా హుసేన్ మియా, కోశాధికారిగా విశ్వనాథరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా లింగమయ్య, దామోదర్‌లతో పాటు 10మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అలాగే భాషోపాధ్యాయ సంస్థ 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు వీరబ్రహ్మం, షరీఫ్, శివయ్య, భాస్కరరెడ్డి, శిరివెళ్ల ఎంఈఓ డీటీ శంకర్‌ప్రసాద్, మహానంది ఎంఈఓ రామసుబ్బయ్య పాల్గొన్నారు.

రైతు సమస్యలపై పోరాటం

నంద్యాల(వ్యవసాయం): బీజేపీ కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో జిల్లా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం సాగిస్తామని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిరుగు పాటి కుమారస్వామి పేర్కొన్నారు. గురువారం విలేకరులతో వారు మాట్లాడుతూ.. నంద్యాలకు వ్యవసాయ రంగంలో దేశంలోనే మంచి గుర్తింపు ఉందని, రైతులు పండించే సోనా మసూరి వరికి దేశంలోనే పేరు పెట్టిందన్నారు.

సుస్థిర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

జూపాడుబంగ్లా: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధికి గ్రామసభల్లో ప్రజల నిర్ణయాల మేరకు తగిన ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి, వైస్ ఎంపీపీలు కృష్ణారెడ్డి, రవణమ్మ తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మండంలోని మండ్లెం, భాస్కరాపురం, తరిగోపుల, పి.లింగాపురం, పోతులపాడు, తంగడంచ, తర్తూరు గ్రామాలకు చెందిన సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు పంచాయతీల అభివృద్ధి–ప్రణాళికల రూపకల్పనపై అవగాహన కల్పించారు. సీఆర్పీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి సాధనకు నిర్దేశించిన తొమ్మిది అంశాలలో తగిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యాచరణ కమిటీలను రూపొందించుకొని తద్వారా నిధులను సమీకరించుకోవాలన్నారు. ఈ కమిటీలు సుస్థిర అంశాలైన వ్యవసాయం, తోటల పెంపకం, పశుపోషణ, నీటివనరుల లభ్యతతో పాటు విద్య, ఆరోగ్యం, స్త్రీ శిశుసంక్షేమం వంటి విషయాలతో పాటు జీవనోపాధుల కల్పన, స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పన వంటి అంశాలపై దృష్టి సారించాల్సి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సీడీపీఓ మంగవల్లి, సర్పంచులు నాగార్జునరెడ్డి, ఈశ్వరరెడ్డి, పీఎం నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రణాళికల రూపకల్పనలపై అవగాహన కల్పిస్తున్న సీఆర్పీ విజయ్‌కుమార్

నియోజకవర్గ స్థాయి క్రీడలకు ఎంపిక

జూపాడుబంగ్లా: మండలస్థాయిలో గురువారం నిర్వహించిన కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడల్లో క్రీడాకారులు ప్రతిభచూపి నియోజకవర్గ స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. కబడ్డీలో తరిగోపుల సచివాలయం , బ్యాడ్మింటన్ బాలుర విభాగంలో జూపాడుబంగ్లా సచివాలయం–1, బ్యాడ్మింటన్ బాలికల విభాగంలో జూపాడుబంగ్లా సచివాలయం–2 జట్లు నియోజకవర్గ స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు పీఈటీ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండల స్థాయిలో ఖోఖో, వాలీబాల్ బాలికల విభాగంలో క్రీడలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ క్రీడలతో మండలస్థాయి ఆడుదాం–ఆంధ్ర క్రీడలు ముగుస్తాయన్నారు. నియోజకవర్గ స్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులను పీఈటీలు శ్రీనివాసులు, శివన్న, స్వరూప, జయమ్మ, పద్మమ్మ, దీప్తి, జాను అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సామేలు, స్పోర్ట్స్ వలంటీర్లు శివ, మహబూబ్ బాషా, అబ్దుల్ రహమాన్, మన్సూర్, అబ్దుల్‌జబ్బార్ పాల్గొన్నారు.



నియోజకవర్గ స్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు



కబడ్డీ మండల స్థాయి విజేత వడ్డేమాన్ జట్టు ట్రోఫీ అందజేస్తున్న ఎంపీడీఓ శోభారాణి

నందికొట్కూరు: ఆడుదాం..ఆంధ్ర పోటీల్లో ప్రతిభ చూపిన గ్రామీణ క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంపీడీఓ శోభారాణి, మున్సిపల్ కమిషనర్ కిషోర్ అన్నారు. గురువారం పట్టణంలోని గవర్నమెంట్ కళాశాల మైదానంలో మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం..ఆంధ్ర పోటీలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. గ్రామీణ క్రీడాకారులను ఉన్నత స్థాయిలోకి తీసుకెళ్లాలని ఉద్దేశంతోనే క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 24వ తేదీ నుంచి నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. మండలస్థాయి ఫైనల్‌లో కబడ్డీ పోటీల్లో దామగట్ల టీమ్‌పై వడ్డేమాన్ టీమ్ విజయసాధించడంతో ట్రోఫిని ఎంపీడీఓ శోభరాణి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా శాప్ కో ఆర్డినేటర్ రవికుమార్, ఈఓఆర్డీ సంజన్న, పీఎస్‌లు, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రైల్వే డబ్లింగ్ పనుల పరిశీలన

నంద్యాల(సిటీ): గుంతకల్లు–గుంటూరు డివిజన్ల మధ్య జరిగే రైల్వే డబ్లింగ్ పనులను ఎస్‌డీజీఎం (సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్)/ సీవీఓ (చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్) అరవింద్ మాల్‌ఖేడే శుక్రవారం పరిశీలించనున్నారని నంద్యాల రైల్వే స్టేషన్ మేనేజర్ దొరస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 19న డోన్ రైల్వే స్టేషన్ నుంచి వచ్చి నంద్యాల రైల్వే స్టేషన్‌ను పరిశీలించి మోటార్ ట్రాలీ ద్వారా జగ్గంబొట్ల కృష్ణాపురం వరకు ప్రయాణించి తిరిగి గిద్దలూరు నుంచి రైలు బస్సులో నంద్యాలకు చేరుకుంటారని పేర్కొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

బొమ్మలసత్రం: జిల్లా వ్యాప్తంగా గురువారం పోలీసులు ముమ్మరంగా తనికీలు నిర్వహించి పలు కేసులు నమోదు చేశారని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని చెక్ పోస్టుల వద్ద సెబ్ అధికారులు విస్తృత తనిఖీలు చేశారన్నారు. ఈ తనిఖీల్లో భాగంగా 80 బైండోవర్ కేసులు, 16 డ్రంకెన్ డ్రైవ్ కేసులు, ఎనిమిది ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశామన్నారు. అలాగే నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించి 20 కేసులు నమోదు చేసి 23 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 122 లీటర్ల సారా సీజ్ చేశామని, 9 డీపీఎల్ కేసులు నమోదు చేసి 116 మద్యం బాటిళ్లు సీజ్ చేశామని చెప్పారు. అలాగే మూడు ఎన్‌డీపీఎల్ కేసులు నమోదు చేయడంతో పాటు 79 కర్ణాటక మద్యం బాటిళ్లు, 9 తెలంగాణ మద్యం సీసాలు సీజ్ చేసి, నంద్యాల వన్ టౌన్ పరిధిలో మట్కా కేసు నమోదు చేసి రూ.3,520 స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఇదిలా ఉండగా దొర్నిపాడు ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న పి.తిరుపాలు నందివర్గం ఎస్‌ఐగా బదిలీ అయ్యారు. అక్కడ బాధ్యతలు చేపట్టిన ఆయన ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసు